సాక్షి జనగామ

గురువారం । 14 । డిసెంబర్ । 2023



'ఆహార భద్రత'..మరో ఐదేళ్లు

రేషన్ కార్డు దారులకు కేంద్రం తీపికబురు తెలిపింది. మరో ఐదేళ్ల పాటు ఉచితంగా బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది.

- 8లో▸



ఘనంగా గౌరీనక్తం

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో గౌరీనక్త వ్రత పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 28^0 /16^0

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

మోక్షం లభించేనా..?

- పదోన్నతులు, బదిలీలకు ఈ ఏడాది ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ
- కోర్టు కేసులు.. టెట్ అర్హతతో సందిగ్ధం
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆశల పల్లకీలో ఉపాధ్యాయులు



జనగామ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కోర్టు మెట్లెక్కిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ.. రేవంత్ రెడ్డి సర్కారుకు కత్తిమీద సామనే చెప్పుకోవచ్చు. గడిచిన 11 నెలలుగా టీచర్లు హక్కుల సాధనకు పోరాడుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు చేసిన తర్వాత స్పౌజ్‌తో పాటు(భార్యాభర్తలు ఒకే చోట పని చేయడం) గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు 10 పాయింట్లు అదనంగా కేటాయించడంపై పలు సంఘాలు కోర్టును ఆశ్రయించగా బదిలీలు, పదోన్నతులపై కోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. సుదీర్ఘ వాదనల తర్వాత గ్రీన్ సిగ్నల్ వచ్చినా.. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు పలు సమస్యలపై కోర్టుకు వెళ్లడంతో మళ్లీ బ్రేక్ పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2011 సంవత్సరంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల తర్వాత స్వరాష్ట్రంలో 2018 సంవత్సరం మరోసారి చేపట్టారు. అప్పటికే ఎనిమిది సంవత్సరాల సర్వీసు నిండిన టీచర్లు నేటికీ ఒకేచోట 12 ఏళ్లకు పైగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుల ఆందోళనలు, నిరసనలతో దిగివచ్చిన నాటి సర్కారు బదిలీలు, పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ మొదలు పెట్టి ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు చేపట్టే లోపు పలు ఉపాధ్యాయ సంఘాలు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచి పోయింది. చిన్న జిల్లాల ఏర్పాటు తర్వాత స్పౌజ్‌తో పాటు గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు 10 పాయింట్లు ఇవ్వాల్సిన అవసరం లేదని కోర్టుకు విన్నవించారు. దీనిపై ఏడు నెలల పాటు వాదనలు జరిగాయి. ఇందుకు సంబంధించి భార్య, భర్తలో ఒక్కరికి 10 పాయింట్లు(స్పౌజ్) ఇస్తూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రారంభించాలని తీర్పు వెలువరించిన కోర్టు.. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు ఇచ్చే 10 పాయింట్లను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది.

1,555 మంది టీచర్ల ఎదురు చూపులు

జిల్లాలో 1,555 మంది ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం 12 నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఇందులో గ్రేడ్-2 హెచ్ఎంలు 39, పీఎస్ హెచ్ఎంలు 23, స్కూల్ అసిస్టెంట్లు(గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సాంఘిక, ఇంగ్లిష్, తెలుగు, హిందీ) 543, సెకండరీ గ్రేడ్ టీచర్లు 745, ల్యాంగ్వేజ్ పండింట్(తెలుగు) 67, ల్యాంగ్వేజ్ పండిట్ (హిందీ) 80, పీఈటీ 29, డ్రాయింగ్ ఒకరు ఉన్నారు. 2011 నుంచి 2023 డిసెంబర్ వరకు జిల్లాలో సుమారు 470 మంది ఉపాధ్యాయులు గడిచిన 13 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్నారు.

పీజీ హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు

జిల్లాలో 39 మంది పీజీ హెచ్ఎంల బదిలీల ప్రక్రియ ముగిసింది. గవర్నమెంట్ సెక్టార్ పరిధి మల్టీజోన్-2లో స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి పీజీ హెచ్ఎంగా పదోన్నతి పొందిన ముగ్గురిని ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇందులో ఒకరు జనగామ జిల్లాలోనే ఉండిపోగా.. మరో ఇద్దరు హైదరాబాద్‌కు వెళ్లారు. లోకల్ బాడీ కేటగిరీ జోనల్ స్థాయిలో 60 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్ఎం పదోన్నతికి బ్రేక్ పడింది. అలాగే ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించి.. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల బదిలీ ప్రక్రియ మిగిలి పోయింది. రంగారెడ్డి జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు తమ సమస్యలపై కోర్టుకు వెళ్లడంతో బదిలీలు, పదోన్నతులకు అడ్డంకిగా మారింది.

టెట్ అర్హతపై ఆందోళన

ఉపాధ్యాయుల పదోన్నతులకు ఎన్‌ఈఆర్‌టీ గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత తెరపైకి రావడంతో ఆందోళన నెలకొంది. టెట్‌కు 45 ఏళ్ల వయస్సు నిబంధన విధించారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న 95 శాతానికి పైగా ఉపాధ్యాయులు అర్హత వయసు కంటే ఎక్కువగా ఉన్నారు. టెట్ రాసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ వయస్సు సరిపోవడం లేదు. టెట్ లేకుండా పదోన్నతులు పొందకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని వయస్సు వెసులుబాటు కల్పించేలా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల ఖాళీలు ఇవే..

జిల్లాలో 2,570 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం 2,143 మంది ఉన్నారు. వివిధ కేటగిరీల్లో 427 ఖాళీలు ఉన్నాయి. ఇందులో హెచ్ఎం-39, స్కూల్ అసిస్టెంట్లు(గణితం, ఫిజికల్, బయో, సోషల్, తెలుగు, హిందీ, ఇంగ్లిష్)-163, పీడీ-5, పీఎస్ హెచ్ఎం-58, ల్యాంగ్వేజ్ పండిట్ (తెలుగు)-12, ల్యాంగ్వేజ్ పండిట్(హిందీ)-9, ఎస్జీటీ-118, పీఈటీ-7, డ్రాయింగ్-2, క్రాఫ్ట్-2, ఒకేషనల్-2 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. డీఎస్సీ ద్వారా పాఠశాలల వారీగా ఖాళీలను భర్తీ చేయనున్నారు.

జిల్లాలో బదిలీల కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల వివరాలు

దరఖాస్తు చేసిన టీచర్లు	:	1,555
గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు	:	39
ఎస్ఏ, సమాన స్థాయి	:	543
ఎస్జీటీ(ఎల్‌పీ, పీఈటీ, ఆర్ట్)	:	922

కోర్టు కేసుల విషయంలో శ్రద్ధ చూపించాలి



నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై కోర్టులో ఉన్న కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా విద్యా విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టి ఖాళీలను భర్తీ చేసి, డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలి. గత ప్రభుత్వంలో మల్టీజోన్-1లో స్కూల్ అసిస్టెంటు నుంచి గెజిటెడ్ హెచ్ఎంలను పదోన్నతి ద్వారా తీసుకున్నారు. మల్టీజోన్-2లో కేవలం గవర్నమెంట్ స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే గెజిటెడ్ హెచ్ఎంలుగా ప్రమోస్లు ఇచ్చారు. కోర్టు కారణాల రీత్యా లోకల్ బాడీ, అన్ని రకాల పదోన్నతులు నిలిచి పోయాయి.

- పి.చంద్రశేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు, టీఎస్‌యూటీఎఫ్

బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలి



కోర్టు కేసులు, ఎన్నికల కోడ్ కారణంగా మల్టీజోన్-2లో ప్రధానోపాధ్యాయ పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్ బదిలీలు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు, ఎస్జీటీ బదిలీలు నిలిచిపోయాయి. ప్రభుత్వం చొరవ చూపి కోర్టులో ఉన్న సీనియారిటీ సమస్యలు పరిష్కరించాలి. స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ పొందే వారికి టెట్ ఉత్తీర్ణతను మూడేళ్లలో పొందేలా గడువు విధించి ప్రమోషన్, బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలి.

- డి.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీపీటీఎఫ్

తక్షణమే బదిలీలు చేపట్టాలి



తెలంగాణాలో వేలాదిమంది ఉపాధ్యాయులు ఏళ్లుగా ప్రమోషన్లు, బదిలీల కోసం వేచి చూస్తున్నారు. రెండు నెలల క్రితం బదిలీలు నిల్చిపోవడంతో మారుమూల ప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఇబ్బందులకు గురవుతూ విధులు నిర్వహిస్తున్నారు. ప్రమోషన్లకు టెట్ తప్పనిసరి అంటున్నారు. ప్రభుత్వం పరిష్కారం కనుగొనాలి. అందుకు సమయం పడుతుందనుకుంటే తక్షణం కనీసం బదిలీలు పూర్తిచేయాలి.

- ఆర్.రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూటీఎస్

న్యూస్‌రీల్

లిఫ్ట్ పనిచేయక దివ్యాంగుల అవస్థలు



జనగామ రూరల్: కలెక్టరేట్‌లో లిఫ్ట్ పనిచేయక దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మరమ్మతు చేపట్టాలని తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడు మేకల సమ్మయ్య కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి దివ్యాంగులు తమ సమస్యలు చెప్పుకోవడానికి కలెక్టరేట్‌కు వస్తుంటారని, కార్యాలయంలో లిఫ్ట్ పని చేయక మెట్లు ఎక్కలేక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. టీఆర్‌వీఎస్ జిల్లా నాయకుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా కోర్టు మంజూరు చేయాలి



జనగామ రూరల్: జనగామకు అదనపు జిల్లా కోర్టు, అలాగే రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ శ్రీనివాస్‌రావును కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కూరెల్ల శ్రీనివాస్‌రెడ్డి, కొరెడ్ల రవీందర్‌రెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, గంగు నాగరాజు శర్మ, గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు కడియం పరామర్శ



చిల్పూరు: ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు ఉన్నారు.

27 వరకు హాల్టింగ్ ఎత్తివేత

కాజీపేట రూరల్: హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య 3వ రైల్వేలైన్ నిర్మాణ పనుల కారణంగా హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌లో రెండు రైళ్ల సర్వీసులకు హాల్టింగ్ ఎత్తివేసినట్లు బుధవారం రాత్రి కాజీపేట రైల్వే కమర్షియల్ అధికారులు తెలిపారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే హసన్‌పర్తి స్టేషన్‌లో తాత్కాలికంగా 14 రోజులు హాల్టింగ్‌ను ఎత్తివేసిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 13 నుంచి 27 వరకు కాజీపేట-సిర్పూర్‌టౌన్(17003) రామగిరి ప్యాసింజర్, సికింద్రాబాద్-సిర్‌పూర్ కాగజ్‌నగర్(17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా హాల్టింగ్‌ను తీసివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.



అర్ధనారీశ్వర అలంకరణ

జనగామ: కార్తీక మాసం ముగింపును పురస్కరించుకుని జిల్లా కేంద్రం పాతబీటు బజార్ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వరుడిని అర్ధనారీశ్వరుడిగా అలంకరించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



కూనూర్ పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈఓ రాము

- జిల్లా విద్యాధికారి రాము

జఫర్‌గఢ్: టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రాము అన్నారు. మండల పరిధి కూనూర్, ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులో రాణించేలా ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలో 10 జీపీఏ సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ రామరాజు, పాఠశాల హెచ్ఎం పర్వేజ్‌తో పాటు ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సోమయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మదన్, మోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రామానుజం, సుధాకర్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ మండలంలో..

జఫర్‌గఢ్: మండల పరిధి ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎస్ఎంసీ సభ్యులు చిల్లర భగవంత్ అందించిన ఇండ్లీ పాత్రను డీఈఓ రాము చేతుల మీదుగా హెచ్ఎంకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ రాము మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమన్నారు. ఉపాధ్యాయులు కిషన్ కుమార్, వెంకటపతి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్ రెడ్డి, మనోహరస్వామి, ఎస్ఎంసీ సభ్యులున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూరు, ఘన్‌పూర్, కేజీబీవీ పాఠశాలలను డీఈఓ రాము సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ సమావేశాలు, టీచర్ డైరీ, ఉపాధ్యాయుల సమీక్ష తప్పనిసరి అమలు చేయాలని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులకు సులభతర బోధన చేయాలని సూచించారు. ఈనెల 16న అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలన్నారు.

భయంతోనే తప్పుడు మాటలు..

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: చేసిన అక్రమాలు, భూకబ్జాలు బయటపడతాయనే భయంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కారుపై పల్లా చేసిన వ్యాఖ్యలను బుధవారం ఆయన ఖండించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడికీ పోదని, సీఎం రేవంత్‌రెడ్డి అక్రమార్కుల భరతం పట్టడం కాయమన్నారు. భూకబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టకుండా జైలుకు పంపుతారని పేర్కొన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనురాగ్ యూనివర్సిటీ కోసం భూకబ్జాలు చేయడమే కాకుండా, ప్రభుత్వంలో ఉంటూ అక్రమాలకు పాల్పడ్డాడని చెప్పారు. వర్సిటీ పిల్లల తల్లిదండ్రుల ఓట్లను జనగామలో నమోదు చేయించి అడ్డదారిలో గెలుపొందాడని ధ్వజమెత్తారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కొమ్మూరి హెచ్చరించారు.

ఘనంగా శౌర్య దివస్

జనగామ రూరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం శౌర్య దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ మాట్లాడుతూ.. మంగోలియా దేశానికి చెందిన బాబర్ శ్రీరాముడి దేవాలయాన్ని కూల్చివేసి ఆ స్థానంలో మసీదు నిర్మించాడని, దీనిని నిరసిస్తూ పోరాటాలు, నిర్బంధాల అనంతరం మసీదును కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని శౌర్య దివస్‌గా జరుపుకుంటున్నట్లు వివరించారు. పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలనారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లి తాత్కాలిక సర్పంచ్‌గా విష్ణు

- కోర్టు ఆదేశాలతో బాధ్యతల స్వీకరణ



తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన విష్ణు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ తాత్కాలిక సర్పంచ్‌గా ఎనిమిదో వార్డు సభ్యుడు బూర్ల విష్ణుకు డీఎల్‌పీఓ బంగారు వెంకటప్రసాద్ బుధవారం బాధ్యతలు అప్పగించారు. హైకోర్టు తీర్పు.. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓతో కలిసి జాయింట్ చెక్ పవర్ ఇచ్చారు. 2019 జనవరిలో గ్రామంలోని 14 వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ రాగా శివునిపల్లికి ఎస్టీ మహిళా రిజర్వేషన్ వచ్చింది. ఎస్టీలు లేని గ్రామంలో రిజర్వేషన్ ఎలా వస్తుందని ప్రజలు సర్పంచ్, వార్డు పదవులకు నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. అనంతరం ఫిబ్రవరి 28న రెండోసారి నామినేషన్లకు నోటిఫికేషన్ వేయగా.. ఊరు తీర్పును కాదని 8వ వార్డు మెంబర్‌గా బూర్ల విష్ణు నామినేషన్ వేయడంతో.. అతడికి పోటీగా ఇదే వార్డుకు చెందిన గాండ్ల జ్యోతి నామినేషన్ వేసింది. దీంతో అధికారులు ఈ ఒక్క వార్డుకు మాత్రమే ఎన్నికలు నిర్వహించగా 43 ఓట్లతో విష్ణు గెలుపొందాడు. అప్పటి నుంచి తనకు సర్పంచ్‌గా అవకాశం ఇవ్వాలంటూ కలెక్టర్, డీపీఓలకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం దక్కలేదు. దీంతో హైకోర్టులో రెండుసార్లు రిట్ పిటిషన్ వేసినా తీర్పు అనుకూలంగా రాలేదు. మూడోసారి లాయర్‌ను నియమించుకున్నాడు. గ్రామానికి సేవ చేయడానికి వార్డు మెంబర్‌గా నిలబడి ఓట్ల ద్వారా గెలిచిన ప్రజాప్రతినిధికి ఎందుకు సర్పంచ్‌గా అవకాశం ఇవ్వరంటూ న్యాయవాది వాదించాడు. దీంతో గ్రామాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విష్ణును తాత్కాలిక సర్పంచ్‌గా నియమిస్తున్నట్లు జడ్జి ఆర్డర్ జారీ చేశారు. దీంతో డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ సమక్షంలో విష్ణు బాధ్యతలు చేపట్టాడు.

'పల్లా' వద్దకు మున్సిపల్ 'పంచాయితీ'

- రాత్రి పొద్దుపోయే వరకు చర్చలు
- అవిశ్వాసం వద్దు.. కొనసాగాలి : పల్లా
- తమ కష్టాలను ఏకరువుపెట్టిన కౌన్సిలర్లు



జనగామ: జనగామ మున్సిపల్ అవిశ్వాస 'పంచాయితీ' ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వద్దకు చేరింది. చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అవిశ్వాసం కోరుతూ కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాలు నడిపిన సంగతి తెలిసిందే. గత ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హయాంలో అవిశ్వాస పంచాయితీ తెరపైకి రాగా.. ఆయన పట్టించుకోలేదు. దీంతో అధికార పార్టీకి చెందిన సభ్యులతో పాటు ప్రతిపక్ష కౌన్సిలర్లు కలిసి చైర్‌పర్సన్‌ను గద్దె దింపాలని వ్యూహాలు రచించారు. పాలక మండలి అధికారం చేపట్టిన తర్వాత నాలుగేళ్ల పాటు అవిశ్వాసానికి అవకాశం లేకుండా గతంలో తీసుకు వచ్చిన జీఓపై గవర్నర్ సంతకం చేయడంతో.. క్యాంపు రాజకీయాలకు బ్రేక్ పడింది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల కావడం, కోడ్ అడ్డంకిగా ఉండడంతో పెద్దగా పట్టించుకోలేదు. ఎన్నికలు ముగిసిన వెంటనే.. ప్రతిపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన పలువురు మెజార్టీ కౌన్సిలర్లు రెండు పర్యాయాలు రహస్య సమావేశాలు నిర్వహించారు. ఇటీవల బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి జోక్యంతో కొంతమేర వెనక్కి తగ్గారు.

కౌన్సిలర్లతో 'పల్లా' చర్చలు

జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పార్టీ కౌన్సిలర్లతో చర్చించారు. అవిశ్వాసం వద్దు.. ప్రస్తుత పాలకమండలిని కొనసాగిద్దామని 'పల్లా' అనడంతో.. కొంతమంది కౌన్సిలర్లు తమ బాధను చెప్పుకున్నారు. లక్షలు ఖర్చు చేసుకుని గెలిచి వస్తే.. తమ వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని ఒకరు చెప్పగా.. కౌన్సిల్‌లో పనులకు సంబంధించిన లెక్కా పత్రం లేదని మరికొందరు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తమను పూర్తిగా డమ్మీ చేశారని, ఎట్టి పరిస్థితుల్లో అవిశ్వాసం పెట్టాల్సిందేనని పట్టుబట్టారు. అయితే.. ఇక నుంచి బాధ్యత నాది.. పట్టువీడి అవిశ్వాసం మాట పక్కన బెట్టాలని 'పల్లా' బుజ్జగించే ప్రయత్నం చేశారు. మూడు గంటల పాటు సాగిన చర్చల్లో సమస్య ఓ కొలిక్కి రాగా.. కొంతమంది మాత్రం అలక వీడడం లేదు. అవిశ్వాసంపై మెజార్టీ సభ్యులు ఓకే అనగా.. చివరి వరకు ఇదే మాటపై వారు ఉంటారా.. లేదా అనేది వేచి చూడాలి.

నాటి దాడులు గుర్తొచ్చాయి..

- వరంగల్ మాజీ ఎంపీ బోడకుంటి వెంకటేశ్వర్లు



జనగామ: పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ హాలులో బుధవారం ఇద్దరు దుండగుల చొరబాటుతో.. నాటి ఉగ్రవాదుల దుశ్చర్యను వరంగల్ మాజీ ఎంపీ బోడకుంటి వెంకటేశ్వర్లు గుర్తు చేసుకున్నారు. 2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై ఇదే రోజున ఉగ్రదాడులు జరిగాయి. ఆ సమయంలో బోడకుంటి ఎంపీ హోదాలో సమావేశాలకు హాజరయ్యారు. నాటి పరిస్థితులను ఈ సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. పార్లమెంటు హాల్ పక్కనే ఉన్న అనెక్సీ చాంబర్ (స్టాండింగ్, ఇతర సమావేశాలు నిర్వహించే హాల్)లో సహచర ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడే సమయంలో.. బయట నుంచి తుపాకీ గుండ్లమోత వినిపించింది. బయటకు వచ్చి చూసే పరిస్థితి లేదు. ఉగ్రవాదులు తాము ఉన్న అనెక్సీ పక్కనే దాడులు చేశారు. లోపల ఉన్న ఎంపీలంతా ఉలిక్కిపడ్డారు. దీంతో సెక్యూరిటీ టైట్ చేశారు. మమ్మల్ని రెండు గంటల పాటు లోపలే ఉంచారు. దాడులు భీకర రూపం దాల్చాయి. కొద్దిసేపు ప్రాణాలు బిగపట్టుకుని ఉండాల్సి వచ్చింది. భద్రతాదళాల కళ్లుగప్పి ఇప్పుడు లోక్‌సభ హాలులోకి దూసుకు వచ్చిన ఇద్దరు దుండగుల హల్‌చల్‌తో అప్పటి భయానకర దృశ్యాలు గుర్తుకు వచ్చాయి. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం.

శాంతి భద్రతలను పరిరక్షించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ సీతారాం

దేవరుప్పుల: ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని జనగామ డీసీపీ సీతారాం అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పల్లెల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్, ఏఎస్సై సదానందం, హెచ్‌సీ శ్రీనివాస్, సదయ్య, శ్యామ్, పోలీస్ సిబ్బంది యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

సంపత్‌రెడ్డి ఆశయ సిద్ధికి పనిచేస్తాం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

చిల్పూరు: బీఆర్ఎస్ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు పాగాల సంపత్‌రెడ్డి.. మన మధ్య లేకున్నా ఆయన ఆశయ సిద్ధికి పనిచేస్తామని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల గుండె పోటుతో మరణించిన జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి సంతాప సభను రాజవరంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల్పించిన అనంతరం వారు మాట్లాడారు. సంపత్‌రెడ్డి విద్యార్థి దశ నుంచే ఉద్యమకారుడని, 2001లో కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ రావాలి.. రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశంతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడని పేర్కొన్నారు. ఏనాడూ.. డబ్బులు, పదవుల కోసం ఆశ పడని మంచి వ్యక్తి అని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ రాజయ్య, నాయకులు కృష్ణారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌రావు, మామిడాల లింగారెడ్డి, మారేపల్లి తిరుమల, మారేపల్లి లలితాదేవి, కృష్ణమోహన్‌రెడ్డి, శ్యాంకుమార్‌రెడ్డి, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, జనగాం యాదగిరి, తాళ్లపల్లి సమ్మయ్య, తీగల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి భగీరథ నీరు

బచ్చన్నపేట: మండల పరిధి అన్ని గ్రామాలకు నిరంతరాయంగా మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ అందించేలా చర్యలు తీసుకుంటామని భగీరథ ఈఈ శ్రీకాంత్, జనగామ డీఈ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు గ్రామాల్లో భగీరథ నీటి సరఫరా గురించి తెలుసుకున్నారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉంటే జీపీ పరంగా పరిష్కరించుకుంటే బిల్లులు అందించేలా చూస్తామన్నారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఏఈ ప్రశాంత్‌కుమార్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ విద్యార్థులు 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు. రూ. 250 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీవరకు గడువు ఉందని తెలిపారు. ఎంఏ, ఎంకాం కోర్సుల విద్యార్థులు అన్నిపేపర్లకు (రెగ్యులర్) రూ. 520 పరీక్షఫీజు, బ్యాక్‌లాగ్ మూడుపేపర్లు ఆపై రూ. 420, బ్యాక్‌లాగ్ రెండు పేపర్ల వరకు రూ. 160, ఇంప్రూవ్‌మెంట్ ప్రతి పేపర్‌కు రూ. 190 పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందన్నారు. ఎమ్మెస్సీ కోర్సుల్లో అన్ని సబ్జెక్టులకు రూ. 620, మూడుపేపర్లు ఆపై రూ. 520, రెండుపేపర్ల వరకు రూ.190, ఇంప్రూవ్‌మెంట్‌కు ప్రతి పేపర్‌కు రూ.190 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

గీసుకొండ: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు.. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ వసంతాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఊరుగొండ బాబురావు(67) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో బంధువులు అతడి తీరు నచ్చక మందలించేవారు. ఇటీవల కింద పడగా తీవ్రగాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. అయినా తాగుడు మానకపోవడంతో భార్య మందలించింది. దీంతో మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఇంటికి రాగా గమనించిన కుటుంబీకులు ఎంజీఎంలో చేర్పించగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బుధవారం తెలిపారు.

ధర్మారంలో మనస్తాపంతో యువతి ..


హరిప్రియ మృతదేహం

ఎల్కతుర్తి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారంలో జరిగింది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల హరిప్రియ(25) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి 2 సంవత్సరాలు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేసింది. అనారోగ్య సమస్యతో ఆరు నెలల క్రితం ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. కాగా, అదే గ్రామానికి చెందిన గుర్రం రాజేష్, హరిప్రియ 5 సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే రాజేష్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన హరిప్రియ.. మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి మొగిళి ఫిర్యాదు మేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఆహార భద్రత'.. మరో ఐదేళ్లు

ఉచిత బియ్యం పంపిణీ గడువును పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 10.92 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుపేదలు


తొర్రూరు మండలం సోమారపుకుంట తండాలో రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

తొర్రూరు : కేంద్ర ప్రభుత్వం.. ఆహార భద్రత (రేషన్) కార్డుదారులకు తీపి కబురు తెలిపింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు రోజురోజుకూ ఆకాశానికి చేరుతున్నాయి. ఫలితంగా కొనుగోలు చేయలేక ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత బియ్యమే తింటూ జీవనం కొనసాగిస్తారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరో ఐదు సంవత్సరాల వరకు వారికి ఆహార కోసం ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా కరోనా కాలం నుంచి అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం పంపిణీని మరో ఐదేళ్ల పాటు పొడగిస్తున్నట్లు కేంద్రం రెండు రోజుల క్రితం ప్రకటించింది. ఈ నిర్ణయంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు విడతల వారీగా బియ్యం పంపిణీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. 2022 మార్చిలో ఆరు నెలలు పెంచింది. ఆ తర్వాత మరో మూడు నెలలు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. అదే ఏడాది చివర్లో కార్డులోని ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందించాలని నిర్ణయించి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నెలతో ఆ గడువు ముగుస్తుండడంతో మరోసారి 2024 నుంచి ఐదేళ్ల పాటు అనగా 2029 సంవత్సరం వరకు యూనిట్‌కు ఆరు కిలోల బియ్యం చొప్పున అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

ఉచితంగానే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10.92 లక్షల మంది ఆహారభద్రత కార్డుదారులు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 2,66,088, వరంగల్ జిల్లాలో 2,19,267, మహబూబాబాద్ జిల్లాలో 2,35,435, భూపాలపల్లి జిల్లాలో 1,21,380, జనగామ జిల్లాలో 1,61,246, ములుగు జిల్లాలో 89,330 కుటుంబాలకు ఉచిత బియ్యం లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,645 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు ప్రతినెలా 22,146 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్రం ఉచిత బియ్యం మరో ఐదేళ్ల పాటు అందించాలని నిర్ణయించడంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. కాగా, ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు.

తండాల్లోనూ ఏర్పాటైతే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తండాలే అధికం. గత ప్రభుత్వ హయాంలో చాలా వరకు గ్రామ పంచాయతీలుగా మారాయి. అయితే ఆయా చోట్ల రేషన్ దుకాణాలను మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ తండాల నుంచి సమీప గ్రామాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అక్కడికి వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో రవాణా భారం తప్పడం లేదు. కొంత మంది లబ్ధిదారులు దూరం వెళ్లలేక, చార్జీల భారం మోయలేక తెచ్చుకోవడం మానేశారు. కొన్ని చోట్ల డీలర్లు ఇష్టానుసారంగా దుకాణాలు తెరుస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి మారుమూల తండాల్లో, అవసరమైన చోట రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధాన్యం.. ఘనం


కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం రాశులు


పత్తి యార్డులో రైతుల పడిగాపులు

- కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం
- రికార్డు స్థాయిలో 38వేల బస్తాల రాక
- సీజన్ ప్రారంభం నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటిసారి

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ బుధవారం ధాన్యం రాశులతో పోటెత్తింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి మొత్తం 38 వేలకు పైగా బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటి సారి. దీంతో మార్కెట్‌లోని షెడ్లు, ఓపెన్ యార్డు ధాన్యపు రాశులతో నిండిపోయాయి. కాగా, ధాన్యం అత్యధికంగా రావడంతో టెండర్లు ఆలస్యంగా వేశారు. 3 గంటల సమయంలో విన్నర్ లిస్టు విడుదలైంది. సుమారు 15వేల బస్తాల ధాన్యమే వ్యాపారులు ఖరీదు చేశారు. రాత్రి వరకు కాంటాలు, లొలకాలు జరిగాయి. మిగిలిన రైతులు రాశుల వద్దే పడికాపులు కాశారు. కాగా, మార్కెట్‌కు 38,322 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, జైశ్రీరామ్ రకం ధాన్యానికి గరిష్ట ధర రూ.3,302, కనిష్ట ధర రూ.2,900, ఆర్ఎన్ఆర్ రకానికి గరిష్ట ధర 3,275, కనిష్ట ధర రూ.2,560, హెచ్ఎంటీ రకానికి గరిష్ట ధర రూ.3,236, కనిష్ట ధర రూ.1,759, బీపీటీ రకానికి గరిష్ట ధర రూ.2,000, కనిష్ట ధర రూ.1,889 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో వాహనాలు వెళ్లే దారిలో ధాన్యం పోయడం వల్ల తాము ఖరీదు చేసిన పత్తిని ఎగుమతి చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ వ్యాపారులు బుధవారం టెండర్లు వేసేందుకు రాలేదు. దీంతో రైతులు పడిగాపులు కాశారు. చివరకు అధికారులను ప్రశ్నించడంతో వారు పత్తి వ్యాపారులతో చర్చలు జరిపారు. ధాన్యం అత్యధికంగా రావడం మూలంగా రైతులు ఓపెన్‌యార్డులో పోసుకున్నారని, ఇక మీదట అలా జరుగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పత్తి వ్యాపారులు టెండర్లు ఆలస్యంగా వేయడంతో రాత్రి వరకు కాంటాలు, లొలకాలు నిర్వహించారు.

కానిస్టేబుల్ మీర్ మహ్మద్ అలీకి అభినందన


సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ అలీ

కాజీపేట: ఇతర రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠాల సమాచారం అందజేస్తూ నిందితులను పట్టుకోవడానికి సహకరిస్తున్న క్రైమ్ వింగ్ కానిస్టేబుల్ మీర్ మహ్మద్ అలీకి తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు ప్రశంస పత్రాలు పంపించారు. వీటిని కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝూ బుధవారం అలీకి అందించారు. నగరంలోని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్న మీర్ మహ్మద్ అలీ జాతీయ స్థాయి క్రైమ్ విభాగానికి అనుబంధంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ గ్రూప్‌లో ఉన్న అంతర్ రాష్ట్ర పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తూ నేరం ఎక్కడా జరిగిన వెంటనే స్పందిస్తూ నేర పరిశోధనకు అవసరమైన సలహాలు అందించేవారు. ఇందులో భాగంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కొటావలి పీఎస్ పరిధిలో దృష్టి మరల్చి రూ.14లక్షల నగదు అపహరించిన ఘటనతో పాటు తమిళనాడులోని ఈరోడ్‌లో జరిగిన 800గ్రాముల బంగారం చోరీకి సంబంధించి సాయం అందించారు. అలీ సమాచారం ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజ్‌నందన్ జిల్లా సీనియర్ ఎస్పీ అభిషేక్ మీనా, ఈరోడ్ ఎస్పీ అనిల్‌కుమార్, కోయంబత్తూర్ రేంజ్ డీఐజీ శ్రావణ్ సాయి సుందర్ 2023వ సంవత్సరానికిగానూ వరంగల్ క్రైమ్ వింగ్ కానిస్టేబుల్ అలీని అభినందిస్తూ ప్రశంస పత్రాలు పంపించారు.కాగా, అలీని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

గణిత శాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలు

- వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎన్ రెడ్డి

కేయూ క్యాంపస్: గణితశాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని గణితశాస్త్ర విభాగంలో మ్యాథ్‌మెటిక్స్ అండ్ అప్లైడ్ మ్యాథ్స్‌మెటిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆ విభాగం అధిపతి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఓరియెంటేషన్‌లో వైఎన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితశాస్త్ర విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. డోమైన్ నైపుణ్యాలతోపాటు 21వ శతాబ్దపు నైపుణ్యాలు కూడా ముఖ్యమన్నారు.వరంగల్ కిట్స్ కళాశాల ఆచార్యులు ఎ శ్రీహరి రావు మాట్లాడుతూ గణితశాస్త్ర విద్యార్థులు నూతన ఒరవడులు కలిగి ఉండాలన్నారు. కేవలం తరగతిగదికే పరిమితం కావొదన్నారు. అసోసియేట్ ఆచార్యుడు ఎల్‌పీ రాజ్‌కుమార్ చాయిస్‌బేస్డ్ క్రెడిట్ సిస్టమ్, పరీక్షా విధానం గురించి వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ స్కిల్స్, వాటి ఆవశ్యకతపై వివరిస్తూ ప్రాంగణ నియామకాల కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ బీఎస్ ఎల్ సౌజన్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్‌సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో భద్రకాళి భక్త సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

మంత్రులను కలిసిన దేవాలయ ఈఓ..

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో దేవాలయ ఈఓ శేషుభారతి, అర్చకులు టక్కరసు సత్యం కలిశారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి యువకుడిపై దాడి


రోదిస్తున్న తల్లి, బంధువులు


రాకేష్‌పై దాడి చేస్తున్న ఆకతాయి

- ఆభరణాలు, నగదు దోచుకున్న ఆకతాయిలు
- చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం


రాకేష్ (ఫైల్)

కాశిబుగ్గ: నగర నడిబొడ్డు వరంగల్ కూరగాయల మార్కెట్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు ఆకతాయిలు ఆ యువకుడిపై విచక్షణరహితంగా దాడికి పాల్పడి అతడి వద్ద ఉన్న ఆభరణాలు, నగదు దోచుకున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలైన యువకుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి రావడంతో కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం నెలకొంది. 20వ డివిజన్ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన ఏకెల్లి రమేష్, మరియ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 10 ఏళ్ల క్రితం తండ్రి రమేష్ చనిపోవడంతో అన్నదమ్ములు దేవరాజ్, రాకేష్(23) బాధ్యత తీసుకుని రెండు సంవత్సరాల క్రితం సోదరి పెళ్లి చేశారు. ఈ క్రమంలో రాకేష్ వంట పని కోసం సోమవారం హనుమకొండకు వెళ్లాడు. అర్ధరాత్రి మహిళ విజయతో కలసి ఇంటికి చేరుకోవడానికి వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్దకు రాగా ముగ్గురు ఆకతాయిలు మద్యం మత్తులో వారిని అడ్డుకున్నారు. విజయను బెదిరించి రాకేష్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం రాకేష్ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, రూ. 6,500 నగదును దోచుకెళ్లారు. తీవ్రగాయాల పాలైన రాకేష్‌ను విజయ స్థానికుల సాయంతో ఎంజీఎంకు తరలించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న రాకేష్ మంగళవారం రాత్రి చెందాడు. కాగా, రాకేష్ మృతికి కారణమైన ఆకతాయిలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు లోపించాయని వివరించడానికి ఈ ఘటన కారణమని చెప్పొచ్చని వారు పేర్కొంటున్నారు. కాగా, దాడికి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలు వాట్సాప్‌లో వైరల్ కావడంతో దుండగులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రాకేష్ మృతదేహన్ని కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రుద్రేశ్వరాలయంలో ఘనంగా గౌరీనక్తం


గౌరీనక్త వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం గౌరీనక్త వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ప్రత్యేక పూజలు జరిపారు. నాట్యమండపంలో 21 కిలోల పసుపుతో గౌరీమాతగా అలంకరించి పూజలు జరిపారు. కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. మహిళలు లలితాసహస్ర నామపారాయణం చేశారు.

ఆదాయం రూ.3,89,706

వేయిస్తంభాల ఆలయ నెలవారీ హుండీ ఆదాయం రూ. 3,89,706గా నమోదైనట్లు దేవాలయ ఈఓ వెంకటయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో పరిశీలకులుగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వ్యవహరించారు.

కదులుతున్న బస్సు నుంచి దూకి ..

- ఛత్తీస్‌గఢ్ వాసి మృతి
- ఏటూరునాగారంలో ఘటన


మంగాలు మృతదేహం

ఏటూరునాగారం: కదులుతున్న బస్సు నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాడవి మంగాలు(43) ఇటీవల ఏటూరునాగారంలో ఉంటున్న బంధువుల వద్దకు వచ్చాడు. తిరిగి ఇంకొందరు బంధువులు ఉంటున్న భద్రాచలం వెళ్లడానికి ఏటూరునాగారం బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడ హనుమకొండ వెళ్లే బస్సులో కూర్చున్నాడు. అయితే ఏ గ్రామం వెళ్లాలని కండక్టర్ అడగగా భద్రాచలమని సమాధానం ఇచ్చాడు. ఈ బస్సు హనుమకొండకు వెళ్తుందని, వేరే బస్సులో ప్రయాణించాలని కండక్టర్ సూచించాడు. దీంతో అప్పటికే అతిగా మద్యం తాగి ఉన్న మంగాలు బస్సు కదులుతుండగానే అందులో నుంచి దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో కండక్టర్ జితేందర్‌రెడ్డి, డ్రైవర్ స్వామి వెంటనే 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా, ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు నుంచి దూకి మృతి చెందిన ఘటనను తెలుసుకున్న డీఎం సురేష్ బుధవారం రాత్రి ఘటనా స్థలిని పరిశీలించారు. ప్రమాద తీరుపై తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సాగరంలో చెరువులో పడి వ్యక్తి ..


దస్రూ (ఫైల్)

జఫర్‌గఢ్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సాగరంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రేగడితండా గ్రామ శివారు టీబీతండాకు చెందిన గుగులోతు దస్రూ (46) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు దస్రూ కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సాగరం గ్రామ చెరువులో ఓ మృతదేహం పైకి తేలింది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్సై మహేందర్ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని దస్రూ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీరు.. నిర్లక్ష్యం వద్దు!

పశువులకు శుభ్రమైన నీరే ప్రధానం
- అధిక పాలదిగుబడికి అత్యంత కీలకం
- తక్కువైతే మూత్ర సంబంధ వ్యాధులు
- నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడే అవకాశాలు




నీరు తాగుతున్న పశువులు

కాజీపేట: పశుపోషణలో దాణా, మేతతో పాటు తాగునీటి విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పశుపోషకులు మొదటి, రెండు విషయాల్లో తీసుకుంటున్న శ్రద్ధ తాగునీటి విషయంలో తీసుకోవడం లేదు. పశువులకే కదా! అని గుంతల్లో నిలిచిన నీటిని తాగిస్తారు. అలాగే, తక్కువ పరిణామంలో అందిస్తున్నారు. ఫలితంగా పశువులు అనారోగ్యం బారినపడి పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పాడి పశువుల తాగునీటి అవసరాలు, వాటి సంరక్షణపై సోమిడి పశువైద్యాధికారి కరుణాకర్‌రెడ్డి రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు.

అవసరమైన నీరు అందించాలి..

పశువులు ఆహారం లేకుండా వంద రోజులైనా జీవిస్తాయి. కానీ నీరు లేకుండా నాలుగైదు రోజులకు మించి బతకలేవు. శరీరంలో కొవ్వు మొత్తం పోయినా, 50 శాతం వరకు మాంసకృత్తులు పోయినా పర్వాలేదు గాని.. పది శాతం నీరు పోతే ప్రాణాంతకమవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పశువులకు నీటి ప్రాధాన్యం గుర్తించాలి. దాణా, మేతతో పాటు తగినంత నీటిని అందించినప్పుడే పాల దిగుబడిలో పెరుగుదల కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.

అధిక పాల దిగుబడి కోసం..

పాడి పశువుల్లో పాల ఉత్పత్తికి నీరు చాలా అవసరం. పాలల్లో 80 శాతం వరకు నీరు ఉంటుంది. ప్రతీ లీటర్ పాల ఉత్పత్తికి పశువుకు కనీసం నాలుగైదు లీటర్ల నీరు ముఖ్యం. పశువులకు నీరు సరిపడినంత అందకపోతే పాల దిగుబడి తగ్గిపోతుంది.

రోజుకు 40 నుంచి 50 లీటర్లు నీరు..

సాధారణంగా పాడిపశువు రోజు 40 నుంచి 50 లీటర్లు నీరు తాగుతాయి. పాలిచ్చే పశువులు అయితే ప్రతి లీటర్ పాలకు నాలుగైదు లీటర్ల నీరు తాగుతాయి. అనావృష్టి పరిస్థితుల్లో పశువులకు పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఎండుగడ్డి, జొన్న చొప్ప, సజ్జవంటి మేత వేయాల్సి ఉంటుంది. అందుకే పశువు ఎక్కువ నీరు తాగుతుంది. పచ్చగడ్డి సమృద్ధిగా లభించినప్పుడు నీటి అవసరం కొంత తగ్గుతుంది. చూడి పశువులకు నీరు ఎక్కువగా ఇవ్వాలి. పశువులకు రోజుకు రెండు, మూడు దఫాలు నీటిని పెడుతూ ఉండాలి. వేసవిలో పశువు నీరు తాగడానికి 24 గంటలు పరిశుభ్ర చల్లని నీరు అందుబాటులో ఉంచితే మరింత మంచిది.

నీరు తక్కువైతే...

పశువులకు నీటి లభ్యత తక్కువైతే జీర్ణక్రియ వ్యవస్థ దెబ్బతిని మూత్ర సంబంధ సమస్యలు ఎదురవుతాయి. నీటి లభ్యత బాగా తగ్గితే వేసవిలో పశువులకు రక్త శాతం కూడా తగ్గుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి చివరకు పశు మరణాలు సంభవిస్తాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పాడి, వ్యవసాయ పశువులకు నీటిని తాగించే ముందు జాగ్రత్తలు పాటించాలి. నీటిలో కరిగి ఉన్న కాల్షియం, మెగ్నీషియం, ఉప్పుపై నీటి నాణ్యత ఆధారపడి ఉంటుంది. నీరు కొంచెం ఉప్పుగా ఉన్నా పశువులు క్రమేపి అలవాటుపడి తాగుతాయి. కానీ నీటిలో నైట్రేట్లు ఎక్కువగా ఉండడం మంచిది కాదు. మేతకు బయటకు వెళ్లే పశువులు అపరిశుభ్రంగా ఉండే నీటిని తాగితే వ్యాధుల బారిన పడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి.